సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 18 । జనవరి । 2024



లాభసాటిగా మొక్కజొన్న
మెట్ట ప్రాంతంలో రైతులు రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పంటకు డిమాండ్ పెరగడమే కారణం.
10లో ▸



విత్తన తయారీ విధానమే వేరు
మెట్టలో వేరుశనగ పంట సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. కోతలు పూర్తయ్యాక జాగ్రత్తలు పాటిస్తే విత్తనాలు రానున్న కాలానికి పనికి వస్తాయి.
10లో ▸



ఆటపాకలో సందడి
సంక్రాంతి సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రం సందడిగా మారింది. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల నుంచి వందలాది మంది వస్తున్నారు.
10లో ▸

న్యూస్‌రీల్

అలరించిన నృత్యాలు



భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 60 వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుద్ధ్య కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేయడానికి జిల్లాస్థాయిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని, అందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ పి.శ్యామ్ సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుందని, డిగ్రీ లేదా పీజీ అర్హతతో పాటు కంప్యూటర్ కోర్సు (మైక్రోసాఫ్ట్ ఎక్సెల్, వర్డ్, పీపీటీ, ఇతర కోర్సు) పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.18,500 గౌరవ వేతనంగా చెల్లిస్తామని తెలిపారు. తెల్ల కాగితంపై పూర్తి వివరాలు, చిరునామా, అనుభవం, అర్హతలను పూరించి దరఖాస్తులను డీఈఓకు గురువారం నుంచి ఈనెల 22న సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని సూచించారు. వివరాలకు సెల్ 9989683388లో సంప్రదించాలని కోరారు.

ఇజ్రాయెల్‌లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భవన నిర్మాణ రంగంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇజ్రాయెల్ దేశంతో ఒప్పందం చేసుకుందని, ఆ రంగంలో అనుభవం, నైపుణ్యం ఉన్న వారికి ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సిరామిక్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ప్లాస్టరింగ్, ఐరన్ బిల్డింగ్ వంటి సాంకేతిక విభాగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయసు, 8వ తరగతి లేదా ఆపై చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వసతి, ప్రయాణ ఖర్చు, ట్యాక్స్ మినహాయింపు సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 91828 18207, 94400 42901, 90302 27668, 95027 98793 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ సదస్సుకు ఆహ్వానం



కర్రి గౌరీ సుభాషిణి, జెడ్పీటీసీ సభ్యురాలు

పెనుమంట్ర: ఆరోగ్యకరమైన గ్రామాలు అనే అంశంపై జాతీయ స్థాయిలో ఈనెల 18,19 తేదీల్లో తిరుపతిలో జరిగే జాతీయ సదస్సుకు పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణికి ఆహ్వానం అందినట్టు ఎంపీడీఓ పద్మ తెలిపారు. జిల్లా నుంచి 10 మంది జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో పాటు ఆరుగురు స్థానిక సంస్థల ప్రతినిధులకు అవకాశం లభించిందన్నారు. సుభాషిణితో పాటు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, కాళ్ల మండలం బొండాడ ఎంపీటీసీ మన్నే నాగలక్ష్మి, నరసాపురం మండలం సీతారామపురం సర్పంచ్ డి.వెంకటేశ్వరరావు, పెంటపాడు మండలం ఆకుతీగపాడు సర్పంచ్ డి. వెంకటేశ్వర్లను ఎంపిక చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో కైకరం విద్యార్థిని



జాహ్నవి

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కూనా జాహ్నవి అనే విద్యార్థిని పూనెలో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. ఈనెల 12 నుంచి 16 వరకు జరిగిన సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీల్లో బీఎస్సీ చదువుతున్న జాహ్నవిని వీఆర్‌జీ యువ కేంద్రం, ప్రభుత్వం జాతీయ యువజనోత్సవాలకు ఎంపిక చేశాయి. 27వ జాతీయ యువజనోత్సవాల్లో జిల్లాస్థాయిలో విజేతగా నిలిచారు. వీక్షిత్‌భారత్ 2047పై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పర్వతారోహణలో ఆమె ఏ గ్రేడ్ సర్టిఫికెట్ కూడా పొందారు. జాతీయ యువజనోత్సవాల మొదటి దశ వర్కుషాపులో పాల్గొన్నారు. తనకు సహకరించిన వర్సిటీ వీసీ టి.జానకీరామ్, నెహ్రూ యువకేంద్రం జిల్లా మేనేజర్ డి.కిషోర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష అద్వితీయం

ప్రజారోగ్యమే పరమావధి
- రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఈనెల 2న ప్రారంభం
- ఇప్పటివరకు 58 క్యాంపుల నిర్వహణ
- 27,903 మందికి వైద్య సేవలు
- 6 నెలలపాటు కొనసాగనున్న కార్యక్రమం



భీమవరం మండలం వెంపలో వృద్ధురాలికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ.. పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 108, 104 సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పల్లెపల్లెనా, వార్డువార్డునా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ స్థానికంగా వైద్యం అందించే కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే తొలి విడత ఆరోగ్య సురక్ష జిల్లాలో విజయవంతం కాగా.. ప్రభుత్వం ఈనెల 2న రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా మెడికల్ క్యాంపులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే వలంటీర్లు, వైద్యా సిబ్బంది జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహించారు. ఇంటింటా సర్వే చేసి ఆరోగ్య సమస్యలున్న వారి రిపోర్టులను క్యాంపులకు అందిస్తున్నారు. సర్వే చేసిన కుటుంబాలకు సంబంధించి రెండో విడత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నారు.

జిల్లాలో 502 క్యాంపులు

జిల్లాలో రెండో విడతలో 502 క్యాంపులు నిర్వహించాలని అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటివరకు 58 శిబిరాలు నిర్వహించి 27,903 మందికి వైద్య సేవలు అందించారు. సంక్రాంతి మూడు రోజుల పాటు సెలవులు రావడంతో నిలిచిన క్యాంపులు తిరిగి ప్రారంభమయ్యాయి. బుధవారం జిల్లాలో ఐదు చోట్ల క్యాంపులు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లాలో ఆరు నెలలపాటు సాగనుంది.

14 రకాల వైద్య పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు సంబంధించి గ్రామీణ ప్రాంతంలో 22 రకాల మందులు, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రజలకు 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే జిల్లా, ఏరియా ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు.

181 మంది వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపులకు 181 మంది వైద్యులను నియమించారు. ఆరోగ్యశ్రీ, వైద్యావిధాన పరిషత్ నుంచి 90 మంది ప్రత్యేక వైద్యులు పనిచేస్తున్నారు. దీనిలో గైనకాలజిస్టులు 19, జనరల్ మెడిసన్ 8, జనరల్ సర్జరీ 18, ఆర్థోపెడిక్ 20, చిన్నపిల్లల వైద్యులు 10, కంటి వైద్యులు 10, ఇతర స్పెషలిస్టు వైద్యులు 5 మంది ఉన్నారు. అలాగే గ్రామీణ, పట్టణాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి 91 మంది వైద్యులు క్యాంపుల్లో సేవలు అందిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. స్థానికంగానే జరిగే శిబిరాలకు వచ్చి వారి ఆరోగ్య సమస్యలపై ఆయా స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు ఎక్కువ సంఖ్యలో క్యాంపులకు వచ్చి సేవలు పొందుతున్నారు. వారు బీపీ, సుగర్‌తోపాటు కంటి సమస్యలకు సేవలు అందుకుంటున్నారు.

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు	
వైద్య సేవలు పొందిన వారు	27,903
పురుషులు	13,000
మహిళలు	14,903
మందులు పొందిన వారు	27,200
సిఫార్సులు	50
కంటి వెలుగు ఓపీ	1,700
పరీక్షలు (సుగర్, బీపీ, రక్త, ఇతర పరీక్షలు)	26,500

ఆరు నెలల పాటు ఫేజ్-2



జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం ఈనెల 2న ప్రారంభమైంది. జూన్ వరకు ఆరు నెలలపాటు క్యాంపులు కొనసాగుతాయి. 502 క్యాంపులు నిర్వహించనున్నాం. ఇప్పటివరకు 58 క్యాంపులు పూర్తి చేశాం. గ్రామాల్లోని ఆరోగ్య క్లినిక్ లేదా సచివాలయం, వార్డు సచివాలయాల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రతి మండలంలో వారానికి ఒక క్యాంపు చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లో, పట్టణ ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో శిబిరాలు జరుగుతున్నాయి. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి సిఫార్సు చేసి అక్కడ వైద్య సేవలు అందిస్తున్నాం.
– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, భీమవరం

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా



భీమవరంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ వెంకటరమణ

భీమవరం (ప్రకాశంచౌక్): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై జిల్లా రవాణా శాఖాధికారులు కొరడా ఝుళిపించారు. ఇప్పటివరకు 49 బస్సులపై కేసులు నమోదు, ఒక బస్సు సీజ్ చేసినట్లు జిల్లా రవాణాశాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో బస్సులను తనిఖీ చేసి, నిబంధనలు అతిక్రమించిన బస్సులకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించామన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో డూప్లికేట్ నంబర్ ప్లేట్‌తో ప్రయాణిస్తున్న సాయి ఆర్‌కేటీ ట్రావెల్స్‌కు చెందిన బస్సును సీజ్ చేశామన్నారు. దాడులు కొనసాగుతున్నాయని, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, కేఎస్ఎన్ ప్రసాద్, రవి కుమార్, లక్ష్మి, సురేంద్రనాయక్, సంజీవ్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొంటున్నారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

బీసీలకు ఎంపీ సీటు కేటాయింపుపై హర్షం



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని, మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పూర్తిగా బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలనే ఉద్దేశంతో బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయిస్తూ దీనిలో భాగంగా ఏలూరు ఎంపీ సీటును మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు, విద్యావంతుడైన సునీల్‌కుమార్‌కు కేటాయించడంపై బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఏ పార్టీ ఏలూరు సీటు బీసీలకు కేటాయించలేదని.. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవతో ఈసారి బీసీలకు కేటాయించడంతో బీసీ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోందంటూ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు అగ్ర తాంబూలం ఇస్తున్న రాజకీయ పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే అని గుర్తుచేస్తున్నారు. మిగిలిన రాజకీయ పార్టీలు బీసీల జపం చేయడం తప్ప ఏ న్యాయం చేయడం లేదన్నారు. ఏలూరు జిల్లా మొత్తం వచ్చే ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంటు స్థానాన్ని గెలిపించి వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని బీసీ నేతలు ముక్త కంఠంతో చెబుతున్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును పలువురు బీసీ సంఘాల నాయకులు బుధవారం కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ బీసీ సెల్ ఏలూరు అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, ఈదలాడ ఉమా మహేశ్వరరావు, ఏలూరు నగర యాదవ సంఘం అధ్యక్షుడు బొట్టా అజయ్, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో శివన్నారాయణరెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో భారత గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) బి.శివన్నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రిపబ్లిక్ డే వేడుకలపై జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని, చిన్నపాటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. గతేడాది మాదిరిగా కలెక్టరేట్‌ను ఆనుకుని ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నామన్నారు. భీమవరం ఆర్డీఓ వేడుకలకు ఓవరాల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. స్టేజీ, సీటింగ్ తదితర ఏర్పాట్లను ఆయన ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మైదానం సిద్ధం చేయడం, చదును చేయడం, పారిశుద్ధ్య పనులను మున్సిపల్ శాఖ ద్వారా నిర్వహించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ వాహనం, వైద్య శిబిరం ఏర్పాటుచేసి అవసరమైన మందులు ఉండేలా చూసుకోవాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూసుకోవడంతో పాటు జనరేటర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారికి సూచించారు. తాగునీటికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని క్రోడీకరిస్తూ సందేశాత్మకంగా, వినూత్నంగా 10 శకటాలను రూపొందించాలన్నారు. భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి వైకేపీ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్‌లో తలపడుతున్న మహిళలు

నూజివీడు: నూజివీడు ధర్మఅప్పారావు కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 47వ స్మారక పురుషుల, మహిళల జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీల్లో 36 జట్లు పాల్గొంటున్నాయి. పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగుతున్నాయి. లీగ్, ప్రీక్వార్టర్స్‌లో పురుషుల విభాగంలో వాయల్పాడు జట్టు వీటీహెచ్ నూజివీడుపై 59–57 స్కోర్‌తో, హైదరాబాద్ లయోలా జట్టు సీబీఏ రాజమండ్రిపై 42–39 తేడాతో, హెచ్ ఫౌండేషన్ గుంటూరు జట్టు ఏలూరుపై 37–36 తేడాతో, హచ్ ఫౌండేషన్ జట్టు నెల్లూరు జట్టుపై 50–49తో విజయం సాధించింది. మహిళల విభాగంలో పల్నాడు జట్టు రామచంద్రాపురం జట్టుపై 33–31 తేడాతో, రామచంద్రాపురం జట్టు సీబీఏ విజయవాడపై 33–29 తేడాతో, నెల్లూరు జట్టు ఏలూరుపై 35–29 తేడాతో గెలుపొందాయి.

సెమీస్‌కు చేరిన మహిళల జట్లు

మహిళా విభాగంలో పలు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. ఛత్తీస్‌ఘడ్, పల్నాడు జట్లు లీగ్, ప్రీక్వార్టర్స్‌లో ప్రతిభ కనబరిచి సెమీస్‌కు చేరాయి. నూజివీడు వీటీహెచ్ జట్టు మిస్టిక్ ఏలూరు జట్టుపై 44–31 తేడాతో, ఏలూరు జట్టు రామచంద్రాపురం జట్టుపై 58–41 తేడాతో గెలుపొంది సెమీస్‌కు చేరాయి. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు రాత్రి వరకు జరుగుతూనే ఉన్నాయి. గురువారం మహిళలు, పురుషుల సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లతో పాటు మూడు, నాలుగు స్థానాలకు మ్యాచ్‌లను నిర్వహించనున్నారు.

జనం.. తిరుగు ప్రయాణం

మళ్లొస్తాం
- పండుగకు వచ్చిన వారు తిరుగు పయనం
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట
- హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు
- మధుర స్మృతులను మూటగట్టుకుని..



తిరుగు ప్రయాణంలో బిజీగా..



ఏలూరు బస్టాండ్‌లో బారులు తీరిన ప్రయాణికులు



ఏలూరులో రైలు ఎక్కుతూ..



బస్సు ఎక్కుతున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏడాదిపాటు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసి సంక్రాంతి పండుగకు జిల్లాకు చేరుకుని కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడిపిన వారంతా వారివారి ఊళ్లకు తిరుగు పయనమవుతున్నారు. ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాలు చేస్తూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన జిల్లావాసులు పెద్ద పండుగ వేడుకలకు స్వస్థలాలకు భారీగా తరలివచ్చారు. నాలుగు రోజుల పాటు తమ స్వగ్రామాల్లో బంధుమిత్రులతో గడిపిన క్షణాలు మనసునిండా నింపుకుని భారమైన హృదయాలతో తిరుగు పయనమవుతున్నారు. భోగి పండుగకు ముందు రోజు నుంచి వందలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన వారు భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నాలుగు రోజుల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మధుర స్మృతులను మదినిండా నింపుకుని వారి వారి గమ్యస్థానాలనకు చేరుకుంటున్నారు.

నాలుగు రోజులపాటు ఆనందంగా..

తెలుగు ప్రజల అతి పెద్ద పండుగ సంక్రాంతి అంటే ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక. భోగి రోజున వేకువజామునే భోగి మంటల వద్దకు చేరుకుని తమ పాత మిత్రులతో మాటామంతీ కలిపి క్షేమ సమాచారాలు పంచుకుని, చిన్న పిల్లలు ఉన్న ఇంటిలో చిన్నారులకు భోగి పండ్లు పోయడం వేడుకగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి రోజున వేకువజామునే లేచి తలంటు స్నానాలు ఆచరించి సొంతూళ్లలోని ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం తాము చిన్నతనంలో తిరిగిన వీధుల్లో సంచరిస్తూ అప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పులపై చర్చించుకున్నారు. ఊరిలోని పాత మిత్రులు ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో వాకబు చేసి వారి చిరునామాలు, ఫోన్ నంబర్లు సేకరించారు. అలాగే కనుమ రోజున మాంసాహార విందులతో పాటు గ్రామంలోని తమ బంధువుల ఇళ్లను సందర్శించి పెద్దల ఆశీర్వచనాలు తీసుకున్నారు. నాలుగో రోజు తిరుగు ప్రయాణానికి హడావుడి పడుతూ తాము ఎక్కాలసిన బస్సులు, రైళ్లను సమయానికి అందుకోవడం కోసం కుస్తీ పడటం కనిపించింది.

బస్టాండ్లు.. రైల్వేస్టేషన్లలో రద్దీ

దూరప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవడంతో జిల్లాలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. ఆయా వాహనాల్లో రిజర్వేషన్లు చేయించుకోవడంతో వాటిని సమయానికి అందుకోవడానికి ముందుగానే బస్టాండులు, రైల్వేస్టేషన్లకు చేరుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాల నుంచి ఏలూరు జిల్లాకు సుమారు 20 నుంచి 25 వేల మంది వరకు ప్రజలు వచ్చినట్టు అంచనా. వీరంతా తిరిగి తమ ప్రాంతాలకు చేరుకోవడానికి జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. ఈ మేరకు ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ప్రతిరోజూ హైదరాబాద్‌కు వెళ్లే 20 బస్సులకు అదనంగా మంగళ, బుధవారాల్లో 40 చొప్పున ప్రత్యేక సర్వీసులను ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు.

మళ్లొస్తామంటూ..

ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ బంధువులతో గడిపిన మధుర స్మృతులను మూటగట్టుకుని వచ్చే ఏడాది వరకూ వాటిని ఆస్వాదిస్తూ గడుపుతామని అంటూ వీడ్కోలు పలకడం కనిపించింది. తమ పుట్టింటిలో పండుగకు వండిన పిండి వంటలను తాము స్థిరపడిన చోట ఇరుగుపొరుగుకు రుచి చూపించే నిమిత్తం తీసుకువెళుతున్నారు. పండుగ మొత్తాన్ని ఆస్వాదించి మరికొన్ని రోజులు ఇక్కడే గడపాలని ఉన్నా తప్పనిసరి పరిస్థితిలో తమ స్వస్థలాలను వీడలేక విడిచి వెళుతున్నామని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

మహిళ క్రికెట్ పోటీలకు నన్నయ జట్టు ఎంపిక



క్రీడాకారిణులకు కిట్ అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎస్.నతానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ఆవరణలో బుధవారం ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొనే నన్నయ వర్సిటీ మహిళ క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియేల్ సమక్షంలో ఈ ఎంపిక జరిగింది. ఈ నెలాఖరులో తమిళనాడులోని అలయప్ప యూనివర్సిటీలో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది. జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులను సీనియర్ ఉపాధ్యాయులు సాయిగణేష్, భవాని అభినందించారు.

పాస్టర్ దాడిలో బాలుడికి గాయం

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో బాలుడిపై చర్చి పాస్టర్ దాడి చేశాడు. ఎస్సై చంటిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 13న అయ్యంకి జోయల్ బాబు అనే బాలుడు తన స్నేహితులతో కలిసి స్థానిక దళితవాడలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో వాలీబాల్ ఆడుకుంటూ ఉండగా చర్చి పాస్టర్ మన్నెం శరత్‌కు చెందిన పెంపుడు కుక్కకు బాల్ తగిలింది. దీంతో పాస్టర్ ఆగ్రహంతో జోయల్ వెదురు కర్రతో దాడి చేయడంతో బాలుడికి గాయమైంది. బాలుడిని చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్ మృతిపై విచారణ

కొయ్యలగూడెం: రాజవరం సమీపంలో విద్యుదాఘాతానికి గురై కోన సురేష్ మృతి చెందిన ఘటనపై శాఖాపరమైన దర్యాప్తు చేసినట్లు ఏపీ ఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం డీఈ పి.రాధాకృష్ణ బుధవారం చెప్పారు. సురేష్ అనే యువకుడు ఈ నెల 14న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేసే సమయంలో షాక్‌కు గురై మృతి చెందాడని అన్నారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేశామన్నారు. మృతుడు సంబంధిత విద్యుత్ అధికారిని, లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా ఎవరినీ సంప్రదించకుండా ఫ్యూజ్ వేసే క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందాడన్నారు. తన పొలంలోని మోటార్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఫ్యూజ్ వేసేందుకు సొంతంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇదే విషయం మృతుడి భార్య కూడా విద్యుత్ అధికారులకు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలిపారు.

మెట్టలో లాభసాటిగా మొక్కజొన్న

- మొక్కజొన్న సాగుపై రైతుల్లో పెరిగిన ఆసక్తి
- 10 వేల ఎకరాలకు చేరిన సాగు విస్తీర్ణం
- దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో మొగ్గు



నూజివీడు మండలం జంగంగూడెంలో మొక్కజొన్న పంట

నూజివీడు: మెట్టప్రాంతంలో రైతులు రబీలో మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ బోర్లే సాగునీటి వనరులుగా ఉన్న నేపథ్యంలో మొక్కజొన్న సాగు అధిక దిగుబడులతో పాటు లాభదాయకంగా ఉంటుందనే ఆలోచనతో మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న పంటను ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతులు చేయడానికి అవకాశాలు పుష్కలంగా ఉండటమే కాక కోళ్ల మేతకు, ఆహార పదార్థాలలో వినియోగం బాగా పెరగడంతో ఈ పంటకు గతంలో లేనివిధంగా ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. పెద్ద సంఖ్యలో లేయర్స్, బ్రాయిలర్ ఫారాలు ఉండటంతో వీటిలో కోళ్ల మేతకు ప్రధానంగా మొక్కజొన్ననే ఉపయోగిస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగి ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ముందుడుగు వేస్తున్నారు. నియోజకవర్గంలోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో దాదాపు 25 వేల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ అందుబాటులో ఉండటంతో మోటర్లు విద్యుత్ ఉన్నంత సేపూ ఆడుతుండటంతో సాగునీటి ఇబ్బందులు కూడా లేకపోవడంతో నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పంట ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుండటంతో ఖర్చులు పోను లాభం బాగానే ఉంటుందనే ఆశతో మొక్కజొన్న సాగుకు రైతులు దిగుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి దాదాపు 10 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. కొన్నిచోట్ల మొక్కజొన్నకు బిందుసేద్యం పద్ధతిని కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,300 వరకు ధర లభిస్తుండటంతో మొక్కజొన్న సాగు లాభసాటిగా మారింది.

విత్తనాల ధరలే అధికం

అయితే మొక్కజొన్న సాగులో పెట్టుబడులు కూడా బాగా పెరిగాయి. ఎకరానికి సరిపడా విత్తనాల కొనుగోలుకు రూ.3,500, దుక్కిఖర్చులు, విత్తనాలను నాటడానికి మరో రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరా భూమిలో 12 కిలోల విత్తనాలను రైతులు నాటుతుండగా కిలో రూ.300కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు ఇచ్చే కంపెనీల విత్తనాలైతే ధర ఇంకా ఎక్కువే. మొక్కజొన్న సాగులో భాగంగా ఎలాంటి సాగునీటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు రైతులు బిందుసేద్యంను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రైతులు సాగునీటి కొరతను అధిగమిస్తున్నారు. బిందుసేద్యం విధానంలో సాగు చేస్తుండటంతో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు వచ్చినా రైతులకు ఇబ్బందులు పెద్దగా ఉండటం లేదు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఉమ్మడి జిల్లా ప్రజలు తరలిరావాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ విగ్రహాన్ని 206 అడుగుల ఎత్తులో దేశంలోనే మూడో అతిపెద్ద విగ్రహంగా విజయవాడలో ఏర్పాటు చేయడం కేవలం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. కుల నిర్మూలన ద్వారా మాత్రమే సమాజ, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, దీనికి ఆచరణాత్మకంగా అంబేడ్కర్ కృషి చేశారన్నారు. అమరావతిలో 19వ తేదీన స్మృతి వనం ఏర్పాటు చేయడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణలో ఉమ్మడి జిల్లా ప్రజలు తరలిరావాలని ఆమె కోరారు.

ఆటపాకలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో సందడి చేస్తున్న పర్యాటకులు



బోటు షికారుకు బయలుదేరుతున్న పర్యాటకులు



కనువిందు చేస్తున్న పక్షులు

కైకలూరు: సంక్రాంతి సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రం బుధవారం పర్యాటకులతో సందడిగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వందలాది మంది పర్యాటకులు బోటు షికారు చేస్తూ ఇక్కడి పక్షుల అందాలను తిలకించారు. విజయవాడ- భీమవరం జాతీయ రహదారిలో ప్రయాణించే అనేక మంది వాహనాలలో వెళుతూ ఆటపాక కేంద్రం వద్ద పక్షులను తిలకించి ఉల్లాసంగా గడిపారు. అదే విధంగా ఇక్కడి పక్షి నమూనా మ్యూజియంను సందర్శించారు. సమీపంలో చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడారు. అటవీశాఖ అధికారులు ఖాన్, కావడి వెంకన్న పర్యాటకులకు కొల్లేరు పక్షుల విశేషాలు, భౌగోళిక పరిస్థితులను వివరించారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నకే పట్టం

మంత్రి కారుమూరి, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని



ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదవర్గాల సంక్షేమానికి అవిరళ కృషి చేస్తూ సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయానికి మంత్రి కారుమూరి బుధవారం ఉదయం చేరుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే నాని సాదరంగా స్వాగతం పలికారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోని ఏలూరు ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిపించి సీఎం జగనన్నకు గిఫ్ట్‌గా ఇస్తామని చెప్పారు. రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నూతన శకానికి నాంది పలుకుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యతనిస్తూ రాజ్యాంగ పదవుల్లో కూర్చొపెట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేశాడని, నేడు సీఎం జగనన్న బీసీలను బ్యాక్‌బోన్‌గా నిలబెట్టి పార్టీ పటిష్టానికి కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2019 నుంచి ఎన్నికల హామీలను పక్కాగా అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టంకట్టబోతున్నారని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఇతర రాజకీయ పార్టీలు తాము ఏమి చేస్తామో చెప్పకుండా కేవలం కుటిల రాజకీయాలకు మాత్రమే పరిమితం అవుతున్నారని విమర్శించారు.

చికెన్ తక్కువ ధరకు అమ్ముతున్నాడని..



తీవ్రగాయాలతో ఉన్న దుర్గారావు

ఉంగుటూరు: తక్కువ ధరకు చికెన్ అమ్ముతున్నాడనే కోపంతో పక్క దుకాణం యజమాని, అతని కుటుంబ సభ్యులు చేసిన దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎ.గోకవరం గ్రామానికి చెందిన నల్లబాయి శ్రీను, కైకరం గ్రామానికి చెందిన కూతాడ దుర్గారావు ఎ.గోకవరంలో పక్కపక్కనే చికెన్ దుకాణాలు నడుపుకుంటున్నారు. బుధవారం ముక్కనుమ పండుగ సందర్భంగా చికెన్ మాంసాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో అతని దుకాణంలో అమ్మకాలు పెరిగాయి. దీంతో పక్క దుకాణం యజమాని శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి దుర్గారావుపై దాడికి దిగారు. ఈ దాడిలో దుర్గారావుకు తీవ్ర గాయాలు కావడంతో అతనిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించారు. చేబ్రోలు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిడమర్రులో అదుపులోనే జ్వరాలు



నిడమర్రు వైద్యశిబిరం వద్ద ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వై.రామకృష్ణ

నిడమర్రు: నిడమర్రు గ్రామంలో జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి అదుపులో ఉందని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ అన్నారు. బుధవారం గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి కె.భాగ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా బుధవారం ఒక్క ఫీవర్ కేసు మాత్రమే నమోదైనా డెంగీ, మలేరియా రక్త పరీక్షల్లో నెగిటివ్ వచ్చిందన్నారు. జ్వరాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అధికారి రామకృష్ణ మాట్లాడుతూ పరిస్థితి సంతృప్తిగా వచ్చే వరకూ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.విజయకుమారి, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, పెదనిండ్రకొలను పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇంటి నుంచి అదృశ్యమై.. శవమై కనిపించాడు

నరసాపురం రూరల్: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ వ్యక్తి పేరుపాలెం తీరంలో శవమై కనిపించాడు. మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన పెద్దప్రోలు వెంకటేశ్వరరావు (52) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గత రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరావు ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, బుధవారం పేరుపాలెం తీరంలోని కొబ్బరితోటలో వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై పోలీసులు ఇచ్చిన సమాచారంతో బంధువులు మృతదేహాన్ని పరిశీలించి వెంకటేశ్వరరావుగా గుర్తించారు. మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతుని బంధువులకు అప్పగించినట్లు మొగల్తూరు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వరరావు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడిన యువతి క్షేమం

ఉండి: ఉండి మండలం ఉప్పులూరులో ప్రేమోన్మాది చేతిలో మంగళవారం దాడికి గురైన యువతి భీమవరం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సురక్షితంగా ఉన్నట్లు ఆకివీడు రూరల్ సీఐ కే సత్యనారాయణ బుధవారం చెప్పారు. అలాగే యువతిపై దాడి చేసిన కొణతం వెంకట కేశవశివ సుబ్రహ్మణ్యంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల దాడిలో గాయపడిన అతనిని మంగళవారం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే అతని తలకు బలమైన గాయం కావడంతో వైద్యుల సూచనల మేరకు అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు సీఐ తెలిపారు.

జామాయిల్ లోడు ట్రాక్టర్ బోల్తా



బంజరగూడెం వద్ద బోల్తా పడిన ట్రాక్టర్

కుక్కునూరు: జామాయిల్ లోడుతో వెళుతున్న ఓ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని బంజరగూడెం గ్రామ సమీపంలో జరిగింది. సారపాకలోని ఐటీసీ కర్మాగారానికి జామాయిల్ కర్రను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. కాగా ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం పట్టణం రెస్ట్‌హౌస్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైనట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన గంటా మధుసూదనరావు దిరుసుమర్రు గ్రామంలోని అత్తారింటి నుంచి మోటార్ సైకిల్‌పై వస్తుండగా సీఎస్ఎన్ స్కూల్ వద్ద మరో మోటార్ సైకిల్ అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలైన మధుసూదనరావును చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ పర్యటన

ఏలూరు (టూటౌన్): రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఏలూరు జిల్లా వికసిత్ భారత్ సంకల్పం యాత్ర ఇన్‌చార్జి వివేక్ ఠాగోర్ గురువారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఈదర, ఉంగుటూరు గ్రామాల్లో నిర్వహించే వికసిత్ సంకల్ప యాత్రలో పాల్గొంటారని, 19న ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని, మధ్యాహ్నం భోగోలులో నిర్వహించి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొంటారని పేర్కొన్నారు. 20న ఉదయం నూజివీడు మండలం యనమదల గ్రామంలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొంటారని తెలిపారు.

విత్తనంగా మలిచే విధానమే వేరు

పాడి - పంట



మెట్ట ప్రాంతంలో వేరుశనగ మొక్కలను భూమి నుంచి తీస్తున్న వ్యవసాయ కూలీలు

చింతలపూడి: దేశంలో పండించే నూనె గింజల పంటల్లో వేరుశనగ పంట అతి ముఖ్యమైంది. ప్రాచీన కాలం నుంచి వేరుశనగ నూనెను వంటల్లో ఉపయోగించేవారు. ఇటీవల మెట్ట ప్రాంతంలో వేరుశనగ సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. పంట కోతలు పూర్తయ్యాక సరైన జాగ్రత్తలు పాటిస్తేనే విత్తనాలు రాబోవు కాలంలో పనికివస్తాయి. లేదంటే పుచ్చుపట్టి పనికి రాకుండా పోతాయి. వేరుశనగలో కోసిన పంటను తగిన తేమ (9 శాతం) వచ్చే వరకు మొక్క నుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. వేరుశనగ విత్తనాలను భద్రపరుచుకుని వచ్చే పంటకు ఉపయోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.నాగకుమార్ రైతులకు సూచించారు.

కాయ ఎండబెట్టే విధానం

ఇది రెండు రకాలుగా చేయవచ్చు. వేరుశనగ కాయలు పైభాగానికి వచ్చేటట్లు చెట్లను చిన్న, చిన్న కుప్పలుగా వేయాలి. లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలను పక్కలకు వచ్చేటట్లుగా చేసి ఎండబెట్టుకోవచ్చు.

తేమశాతం తగ్గించడం ఇలా

కాయల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటే ఎండలో ఆరబెట్టకుండా తేమను 7 లేదా 8 శాతానికి తీసుకురావాలి. వేడి గాలులను వదిలే పరికరాలను ఇందుకు ఉపయోగించవచ్చు. వేరుశనగ పంటను నిల్వ చేయడానికి ఒకసారి వాడిన సంచులను మరలా వాడకూడదు. పాలిథీన్ పేపర్ ఉన్న గోనె సంచులు బాగా ఎండిన వేరుశనగ కాయలను నిల్వ చేయడానికి ఉపయుక్తం.

ఎండలో ఆరబెట్టకూడదు

ఖరీఫ్ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పర్వాలేదనిపించినా, రబీ కాలంలో పీకేటప్పుడు వాతావరణం ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటుంది. కాబట్టి కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో ఆరబెట్టాలి. లేదా ఎండ తీవ్రత ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల తరువాత తక్కువగా ఉంటుంది కాబట్టి ఆ సమయాల్లో ఆరబెట్టుకోవాలి. ఎండబెట్టే సమయంలో వేరే రకాల కాయలు కలవకుండా చూడాలి.

కాయ నిల్వ చేసే విధానం

వేరుశనగ విత్తనం కోసం బాగా ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి. కాయలను కదిలిస్తే గల్లుమని శబ్దం రావాలి, అప్పుడే బాగా ఎండినట్లు అర్థం. కాయలను నిల్వ చేసుకోవడానికి శుభ్రమైన లోపల పాలిథీన్ లైనింగ్ ఉన్న గోనె సంచులను వాడాలి. గోనె సంచులను 0.5 శాతం మలాథియాన్ ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టుకోవాలి. దీని వల్ల కాయల్లోని గింజలకు శిలీంధ్రాల బెడద ఉండదు.



ఎం.నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి

క్లుప్తంగా

ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని నవాబుపాలెం గ్రామంలో బుధవారం ముగ్గులు, కుర్చీలాట వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, జిల్లా కమిటి సభ్యుడు కండెల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ చెడు సంస్కృతికి వ్యతిరేకంగా గత 38 ఏళ్లుగా నవాబుపాలెం గ్రామంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు సర్పంచ్ మద్దుకూరి ధనరాజు, బత్తుల రాంబాబు, పంగిడి రాంబాబు, సన్నిధి మంగరాజు, మంచాల నాగేశ్వరరావులు బహుమతులు అందజేశారు. గ్రామస్తులు, బాలబాలికలు పాల్గొన్నారు.

నేడు ఆరుగొలనులో సకల జన సమ్మేళన యాత్ర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో గురువారం ఉదయం 11 గంటలకు సకల జన సమ్మేళన పాదయాత్ర నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారని, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

పెంటపాడు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని ఎంఈఓ టి.వి.రామక్రిష్ణ, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌టీవీఎన్ హిందూ హైస్కూల్‌లో గత మూడు రోజుల నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పురుషుల కబడ్డీ, పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఖోఖో, క్రికెట్ తదితర పోటీల్లో పలు గ్రామాల టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, తహసీల్దార్ జీవి శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పార్టీ నాయకులు బర్ల జయరామ్‌బాబు, నల్లిమిల్లి అంజిరెడ్డి, బండారు రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, క్రీడల ఇన్‌చార్జి శేఖర్, పీఈటీలు సత్తి కన్నారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సాయి హరనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, యోహాను, కృపావరం, రావిపాడు శ్రీనివాస్, వైశాలి, ఉమామహేశ్వరి గ్రామ కార్యదర్శి రామారావు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్లో కలిసిన పూర్వపు విద్యార్థులు

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు బుధవారం హైస్కూల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 1992–93లో పదవ తరగతి చదువుకున్న వీరంతా చాలా ఏళ్ల తరువాత కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకించుకున్నారు. ఆనాటి హైస్కూల్ జీవితంలో జరిగిన సంఘటనలు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను చర్చించుకున్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ఇరగవరం: గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికను అన్ని శాఖల అధికారులు పకడ్బందీగా తయారు చేయాలన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మాబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ స్థాపన దేశానికే తలమానికం



అంబేడ్కర్ విగ్రహస్థాపన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ వద్ద రూ.404 కోట్లతో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 206 అండుగుల విగ్రహం దేశానికే తలమానికమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ముప్పిడి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన కవచం అణగారిన వర్గాలకు ఇప్పటికీ రక్షణగా నిలిచిందన్నారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ వేడుకకు నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల సెక్రటరీలను, వలంటీర్లను తీసుకువెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సంపత్ తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ స్వాగత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవాబుపాలెం సొసైటీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు కట్టా రంగబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగ్జీవన్, తాడేపల్లిగూడెం సొసైటీ చైర్మన్ గుమ్మళ్ళ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

చెడు సంస్కృతిని పారద్రోలడానికి చెడుగుడు పోటీలు


వీరంపాలెం-వెంకట్రామన్నగూడెం జట్ల మధ్య జరుగుతున్న చెడుగుడు పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: సంక్రాంతిని సందర్భంగా జరిగే కోడిపందేలు, జూద క్రీడలు వంటి చెడు సంస్కృతిని పారద్రోలడానికి, యువతను సన్మార్గంలో నడిపించడానికి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉప్పరగూడెం సర్పంచ్ దండే కనకబాబు అన్నారు. అంబేద్కర్ కమిటి ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకబాబు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి ఈ చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 22 టీమ్‌లు ఈ పోటీలకు హాజరయ్యాయన్నారు. చెడుగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో దండే చినగోతియ్య, దండే కోటయ్య, దేశాబత్తుల శాంతారావు, ఏలూరి వీరాస్వామి, మరపట్ల సుబ్బారావు, దండగే ఏసురత్నం, దండే అమరబాబు, మార్ని వెంకట్రావు, దండే కోటసత్తియ్య, అంబేద్కర్ కమిటి సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాలుగో రోజు కొనసాగిన కోడిపందేలు


బుధవారం రాత్రి దువ్వ గ్రామంలో జరుగుతున్న కోడి పందేలు

తణుకు: సంక్రాంతి పురస్కరించుకుని మూడు రోజుల పాటు తణుకు నియోజకవర్గంలో జరిగిన కోడి పందేలు నాలుగో రోజైన బుధవారం సైతం కొనసాగాయి. సాధారణంగా ప్రతి ఏడాది భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. అయితే ఈ సారి ముక్కనుమ రోజు కూడా కోడిపందేలు జరగగా కోతాట, పేకాట, గుంటాట యథేచ్ఛగా కొనసాగాయి. తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో మంగళవారం సాయంత్రం వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయని పేర్కొంటూ పోలీసులు ఆయా ప్రాంతాల్లో శిబిరాలు తొలగించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి తిరిగి కోడి పందేలను కొనసాగించగా పోలీసులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడంతో పందేల రాయుళ్లు రెచ్చిపోయారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో బుధవారం రాత్రి 10 గంటల వరకు పందేలు నిర్వహించడం విశేషం.

ఎంపీ రఘురామకు గుణపాఠం తప్పదు

తాడేపల్లిగూడెం అర్బన్: సంస్కార హీనుడు నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజుకు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంతపేకుమార్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంపత్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నుంచి ఎంపీగా గెలిచిన రఘురామ కృష్ణంరాజు తరువాత ప్రజలకు కనిపించిన దాఖలాల్లేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై అవాకులు చవాకులు పేలడానికి తాడేపల్లిగూడెం వచ్చిన రఘురామకృష్ణంరాజును ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి ఎంపీగా గెలిచిన తరువాత కరోనా, తుపాన్ల సమయంలో ప్రజలు అల్లాడిపోతుంటే కనుచూపుమేర ఎక్కడా ఎంపీ దర్శనం లేదన్నారు. అధికార పార్టీ తరపున ఎంపీగా ఉంటూ పార్టీలో కొనసాగుతూ ఆ పార్టీనే తిట్టడం సబబు కాదన్నారు. ఎంపీ పదవికి రాజీనామా చేసి వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఇష్టమొచ్చిన పార్టీలో పోటీ చేసి గెలవాలని ముప్పిడి సంపత్‌కుమార్ సవాల్ విసిరారు.

ద్వారకాతిరుమలకు కాలి నడకన రఘురాం


ద్వారకాతిరుమలకు బయలుదేరిన అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: తనకు క్యాబినెట్ హోదా రావడంతో అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం మొక్కుకున్న విధంగా గురువారం కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసి ద్వారకాతిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. తన ఇష్టదైవమైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మంచి అనుభూతిని ఇస్తుందన్నారు. 20 వ తేదీన కాని, ఆ తర్వాత గాని రఘురాం పదవీభాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

నేటి నుంచి వీరంపాలెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం గ్రామంలో ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు వ్యవసాయ కళాశాల (రాజమహేంద్రవరం) అసోసియేట్ డీన్ డాక్టర్‌చావన్ శ్యామ్ రాజ్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోఆర్డినేటర్లుగా డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్, వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా పెరటి తోటల పెంపకం, పశువైద్య శిబిరం, క్షేత్ర సందర్శనలు, ఎలుకల నిర్మూలన తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. 24వ తేదిన వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు, రైతులు – శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం


మాట్లాడుతున్న యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా బస్సులు నడపాలని ఆర్టీసీ తాడేపల్లి గూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలు ఫిబ్రవరి 14 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలను వివరించారు. సురక్షిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా డ్రైవర్లు ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, గేరేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు పటిష్ట చర్యలు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డా. అనపర్తి శామ్యూల్ తెలిపారు. రోజుకు మూడు వార్డుల చొప్పున దోమల నివారణ రసాయనాలను డ్రెయినేజీలోను, మురుగురునీరు నిల్వ ఉన్న ఖాళీస్థలాల్లో స్ప్రే చేయిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రేవేటు స్థలాల యజమానులు తమ ఖాళీస్థలాలను శుభ్రపర్చుకోవాలని సూచించారు.

ఆరవల్లి ఆరాధ్య దైవం వేమన

అత్తిలి: ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం శ్రీయోగివేమన 99వ జయంతి ఉత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేమన జయంతి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ప్రతి ఏటా జనవరి 18న వేమన జయంతి ఉత్సవాలు భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు శ్రీయోగివేమన జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి తెలిపారు.